క్లుప్తంగా

పార్సిల్ కార్యాలయాలలో ముమ్మరంగా తనిఖీలు


సామర్లకోట రైల్వే పార్సిల్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సామర్లకోట: పట్టణ పరిధిలో వివిధ పార్సిల్, కొరియర్ కార్యాలయాల్లో బాంబు స్క్వాడ్ మంగళవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. కాకినాడలో సోమవారం బాలాజీ ట్రాన్స్‌పోర్టు గోదాములో భారీ పేలుడు సంభవించడంతో ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలో జాగిలాలతో తనిఖీలు, సోదాలు నిర్వహించారు. అలాగే రైల్వే పార్సిల్ కార్యాలయం, బస్సు కాంప్లెక్స్‌లోని ఆర్టీసీ కొరియర్ కార్యాలయంలోను, పట్టణ పరిధిలోని పార్సిల్ కార్యాలయాలలో తనిఖీలు చేశారు. ఈ మేరకు పార్సిల్, కొరియల్ నిర్వహణ సిబ్బందికి పోలీసులు సూచనలు చేశారు. అనుమానాస్పదంగా ఉన్న వస్తువులు రవాణా చేస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సరకుల రవాణా నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే తెలియని వ్యక్తులు చేసే పార్సిల్స్‌పై నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగా రావు, పోలీసు, బాంబు స్క్వాడ్ పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో ఉండాలి

మున్సిపల్ డీఈ శశిధర్


సామర్లకోట స్టేషన్ సెంటర్‌లోని గడియారం స్తంభం పనులను పరిశీలించిన డీఈ, ఏఈలు

సామర్లకోట: పట్టణ పరిధిలో జరుగుతున్న పనులు నాణ్యతతో ఉండాలని మున్సిపల్ డీఈ కె.శశిధర్ అన్నారు. స్థానిక తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద కల్వర్టు పనులు, స్టేషన్ సెంటర్‌లోని గడియారం స్తంభం పనులను ఆయన పరిశీలించారు. గడియారం స్తంభం పట్టణానికి ముఖ్య కూడలిలో ఉండడంతో అందరి దృష్టి దీనిపై ఉంటుందని, దాంతో ఇచ్చిన నమూనా ప్రకారం సుందరంగా తయారు చేస్తున్నట్టు డీఈ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఎం రమేష్‌బాబు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.


భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి


భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ చికిత్సను పరిశీలిస్తున్న ఎంఈఓ

పెద్దాపురం: విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం మండల విద్యాశాఖాధికారి వీఆర్‌కే చౌదరి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్ విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్నసేవలపై మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు విద్యాశాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు మెరుగైన వైద్య, విద్య సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఓ విద్యార్థికి అందిస్తున్న ఫిజియో థెరపీని పరిశీలించి అతడి రికార్డును తనిఖీ చేశారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శివజ్యోతి, ఫిజియోథెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పిఠాపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గొల్లప్రోలు కరణం వీధి తోటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో యోగా, తృణధాన్యాలు, వంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగమణి, మానసాదేవి తదితరులు పాల్గొన్నారు.


పిల్లల తల్లులకు యోగాపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ దుర్గాదేవి

ఆస్తులు అన్యాక్రాంతమై..


గోర్సలో పురాతన సీతారామస్వామి ఆలయం

- ఆక్రమణలో 30.96 ఎకరాల ఆలయ పంట భూమి
- శిథిలావస్థకు చేరిన సీతారామ ఆలయం
- ధూప దీప నైవేద్యాలకు భారం
- ప్రభుత్వ భృతితోనే ప్రసాదాలు
- పోరాడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు


గోర్సలో అక్రమణకు గురైన ఆలయ భూమి

కొత్తపల్లి: శతాబ్దాలుగా ప్రసిద్ధి గాంచిన సీతారాముల ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. కోట్ల రూపాయల విలువ చేసే భూములు ఆక్రమణ చెరలో చిక్కుకోవడంతో ఆలయంలో ధూప, దీప, నైవేద్యాలు చేయడం భారమయ్యాయి. ఆలయ అర్చకుడుకి ప్రభుత్వం అందించే భృతితోనే దేవుడికి ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు. దేవాలయ బాగోగులు కోసం రాజులు కేటాయించిన భూమి నేడు పరుల చేతుల్లో ఉండడంతో దాతల సహకారంతోనే ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించే పరిస్థితి ఏర్పడింది. మండలంలోని గోర్స గ్రామంలో ఉన్న పురాతన సీతారామా ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. ఆ ఆలయాన్ని పిఠాపురం మహారాజు హయాంలో నిర్మించారు. ఆలయానికి సంబంధించి ధూప దీప నైవేద్యాల కోసం గోర్సలో 14శతాబ్దంలో సర్వే నంబర్ 121, 122లో 19.92, కుతుకుడుమిల్లిలో సేర్వే నంబర్ 142/1లో 4.89 ఎకరాలు, 142/2లో 6.25 ఎకరాలను కేటాయించారు. గోర్స ఉన్న 19.92 ఎకరాలను స్థానికంగా ఉన్న కండేపల్లి నాగన్న, అప్పన్నలకు కౌలుకు ఇచ్చి వచ్చిన ఆదాయాన్ని ఆలయానికి ధూప దీప నైవేద్యాలకు ఇచ్చేలా ఏర్పాటు చేశారు. అయితే రాను రాను కొతకాలం తరువాత వారు ఆ భూమిని ఆక్రమించి అన్యాక్రాంతానికి పాల్పడ్డారు. అప్పటి దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోకకోవడంతో ఆ భూమిని రెవెన్యూ అధికారుల సహకారంతో కొంత మంది రైతులు ఆక్రమించుకున్నారు. అప్పటి నుంచి ఈ భూమిపై 1962లో నుంచి భూమి కోసం పోరాటానికి దిగారు. హైకోర్టును సైతం ఆశ్రయించారు. పలు మార్లు అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లడమే తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవు. 2013లో గ్రామస్తులు సహకారంతో దేవదాయ శాఖ ఎండోమెంటు ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి భూమి కోసం హిందూ ధర్మ రక్షణా సమితి సభ్యులు కూడా పోరాటానికి సిద్ధమయ్యారు.

ఇవీ భూముల వివరాలు

గోర్సలో సర్వే నంబర్ 121, 122లో 19.92 ఎకరాలు, కుతుకుడుమిల్లిలో సర్వే నంబరు 142 /1 4.89 ఎకరాలు, 142/2లో 6.25 ఎకరాల భూమి ఉంది.

ప్రభుత్వం అందించే రూ.15వేల భృతితో ఆలయ అర్చకులు పోషణ, ఆలయ ధూప దీప నైవేద్యాలను అందిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితి

ఈ భూములకు సంబంధించి 30.96 ఎకరాల భూమి ఆక్రమణదారుల అన్యాక్రాంతంలో ఉంది. భూములపై దేవదాయ శాఖ కోర్టును ఆశ్రయించింది.

పోరాటం ఆగదు



సీతారామస్వామి వారి భూములను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకునే వరకూ పోరాటం ఆగదు. అధికారులు ఆలయ భూమిపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోవడం వల్లే కాలయాపన అవుతోంది. దీనిపై గ్రామస్తులు అంతా కలిసి పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నాం

– అయినంపూడి సత్యనారాయణ రాజు, గోర్స

ధూప దీప నైవేద్యాలు భారం



ఆలయానికి ఉన్న భూమి పూర్తిగా అన్యాక్రాంతమైంది. ఆదాయం లేక ధూప దీప నైవేద్యాలు చేయడం భారంగా మారాయి. ప్రభుత్వం స్పందించి ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని దేవాలయానికి అప్పగించాలి.

– చక్రవర్తుల అనంతాచార్యులు, ఆలయ అర్చకులు

ఆదాయం లేక..



వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సీతారాముల ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ ఆలయ రాజగోపురం పునర్నిర్మాణానికి స్థానిక విద్యుత్ పరిశ్రమ యాజమాన్యం సహకరించింది. ఆలయానికి సంబంధించి విశిష్ట పర్వ దినాలలో నిర్వహించే పూజా కార్యక్రమాలు దాతల సహకారంతో నిర్వహిస్తున్నారు. కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నా ఆలయానికి రూపాయి కూడా ఆదాయం లేదు. స్వామివారి ఆస్తులు కాపాడుకునేందుకు పోరాటం చేస్తాం.

– పెనగంటి సత్తిరాజు, గోర్స

ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలు పాటించాలి

- రాక్ సిరామిక్స్ యాజమాన్య ప్రతినిధులు
- భద్రతా వారోత్సవాల సందర్భంగా వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో పోటీలు


వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో విజేతలకు బహుమతులు అందజేసిన చెల్ల దుర్రై

సామర్లకోట: పరిశ్రమలలో పని చేసే ఉద్యోగులు, కార్మికులు భద్రతా నియమాలు పాటించాలని రాక్ సిరామిక్స్ హెచ్ఆర్ అండ్ అడ్మిన్ హెడ్ టి.నీరజ్‌కుమార్, జనరల్ మేనేజరు రాజేంద్ర సింగ్ మాన్, టైల్స్ హెడ్ వినోద పైక వాసుదేవ, శానిటరీ వేడ్ హెడ్ చెల దుర్రై అన్నారు. భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఏడీబీ రోడ్డులో ఉన్న రాక్ సిరామిక్స్‌లో భద్రత పతాకాన్ని ఎగురవేశారు. భద్రతకు సంబంధించిన నిబంధనలు పాటించడం ద్వారా పరిశ్రమ, సమాజ శ్రేయస్సుకు కృషి చేసినట్టు అవుతుందని వారు పేర్కొన్నారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమంలో కార్మికులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఉద్యోగులు, కార్మికులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులలో భద్రతపై అవగాహన పెంచేలా వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో భద్రతకు సంబంధించిన అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు శానిటరీ వేర్ హెడ్ చెల్ల దుర్రై బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు, పర్చేజ్ హెడ్ వెంటేశ్వరరావు, ఈహెచ్‌ఎస్ మేనేజరు బాలాజీ పబ్లిక్ రిలేషన్స్ మేనేజరు వీజీఎస్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన రక్షణ స్వస్థత మహాసభ

పెద్దాపురం: మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విరవ చర్చి ప్రాంగణంలో నిర్వహించిన రక్షణ స్వస్థత మహాసభలు మంగళవారం రాత్రి ఘనంగా ముగిసాయి. ప్రముఖ రాజమహేంద్రవరం దైవ జనులు రెవరెండ్ శుభాకర్ దైవ ప్రసంగాన్ని నమ్మకమైన భక్తిభావంతో దేవుని ఆరాధిస్తే మంచి స్వస్థత సాధ్యపడుతుందన్నారు. ప్రార్థనా మందిరం వ్యవస్థాపకులు నంగిన సత్యానందం, సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవుని దీవెనలతో మంచి రక్షణ పొందాలనే ఆకాంక్షతో రక్షణ స్వస్థత మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విరవ క్వయర్ సభ్యులు ఆలపించిన క్రైస్తవ సంగీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దైవజనులు కాసా అభిషేక్, వంకా జాన్, ఎలిషా, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


స్వస్థత మహాసభల్లో గీతాలు ఆలపిస్తున్న విశ్వాసులు

కోర్టు పిటిషన్ ఉపసంహరణ


గ్రామస్తుల నుంచి భూ వివరాలను తెలుసుకుంటున్న దేవాదాయ శాఖ అధికారి దుర్గా భవానీ


అన్యాక్రాంతమైన భూమిని పరిశీలిస్తున్న దేవదాయ శాఖ అధికారి దుర్గా భవానీ

- నూతన జీఓ ఆధారంగా భూమి స్వాధీనం
- జిల్లా ఎండోమెంటు అధికారి దుర్గా భవానీ

కొత్తపల్లి: సీతారాముల ఆలయానికి సంబంధించి అన్యాక్రాంతమైన భూములపై దేవదాయ శాఖ అధికారులు ఎండోమెంటు ట్రిబ్యునల్ కోర్టులో వేసిన పిటీషన్‌ను త్వరలో ఉప సంహరించుకుని నూతన జీఓ ఆధారంగా ఆ భూములను స్వాధీనం చేసుకుంటారని జిల్లా ఎండోమెంటు అధికారి దుర్గా భవాని అన్నారు. మండలంలోని గోర్స గ్రామంలో ఉన్న పురాతన సీతారామ ఆలయానికి సంబంధించి భూములు అన్యాక్రాంతం కావడంపై గ్రామస్తులు మంగళవారం కాకినాడలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌ను కలిశారు. ఆయన ఆదేశాలతో ఆ భూములను జిల్లా ఎండోమెంటు అధికారిని పరిశీలించారు. భూములకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతారామ ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 121, 122లో ఉన్న సుమారు 19.92 ఎకరాల భూమి అన్యాక్రాంతం కావడంతో దేవదాయ అధికారులు ఎండోమెంటు ట్రిబ్యునల్ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. కొత్త జీఓ ప్రకారం వాటిని ఉపసంహరించుకుని భూ ఆక్రమణదారులకు నోటీసులను జారీ చేసి భూమిని స్వాధీనం చేసుకుంటారన్నారు. భూమికి సంబంధించి గ్రామస్తుల నుంచి సేకరించిన ఆధారాలను కమిషనర్‌కు అందిస్తామన్నారు. ఆమె వెంట పలురువు దేవదాయ శాఖ అధికారులు ఉన్నారు.

ఉపాధితో చెరువుల అభివృద్ధి


కట్టమూరులో రహదారి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటలక్ష్మి

డ్వామా పీడీ వెంకటలక్ష్మి

పెద్దాపురం: ఉపాధి హామీ పథకంలో గ్రామీణ ప్రాంత చెరువులు మరింత అభివృద్ధి చెందనున్నామని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో ఉపాధి హామీ నిధుల ద్వారా అభివృద్ధి చేస్తున్న చెరువులు, రోడ్లను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ ద్వారా చెరువుల అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కట్టమూరు గ్రామంలో గోకులం షెడ్డును, రహదారుల అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ సుధీర్, జేఈ సతీష్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

గీత దాటితే బాదుడే


డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న రవాణాశాఖాధికారులు


రహదారిపై స్పీడ్ గన్‌తో వాహన వేగాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

- నిబంధనల అతిక్రమణపై రవాణాశాఖ సీరియస్
- ఈ–చలానా జోరు పెంచిన అధికారులు
- ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి
- రెండో సారి పట్టుబడితే రూ.10 వేల ఫైన్

బాలాజీచెరువు: రహదారిపై మేం స్పీడ్‌గా వెళుతున్నాం. మమల్ని ఎవరూ పట్టించుకోలేదు. మద్యం తాగి వెళుతున్నా మమల్ని ఎవరూ ఆపలేదు అనుకుంటున్నారా? ఆగండాగండి.. అలా అనుకుంటే వాహనచోదకులు పప్పులో కాలేసినట్టే. వాహనాన్ని ఆపి తనిఖీ చేసి కేసులు రాసే రోజులు పోయాయి. తాజాగా నిబంధనలు అతిక్రమించి వెళుతున్న వాహనాల ఫొటోలు తీసి నేరుగా వాహనదారు ఇంటికి జరిమానా విధిస్తున్నట్టు చలానాలు పంపించే రోజులు వచ్చాయి.

ప్రధానంగా వాహన చోదకులు నిబంధనలు అతిక్రమించడం వల్లే రహదారులపై ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తున్నట్లు రవాణా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో బ్రీత్ ఎనలైజర్‌తో పాటు స్పీడ్ లేజర్ గన్‌తో తనిఖీలు చేపడుతున్నారు. తనిఖీలో ఏదో ఒక ప్రాంతంలో మద్యం తాగి పట్టుబడుతున్న వాహనాచోదకులు అధిక సంఖ్యలో ఉంటున్నారు.

అదే విధంగా జాతీయ రహదారిపై ఎంత పోవాలనే దానిపై బోర్డులతో పాటు హెచ్చరికలు జారీ చేస్తుంటాయి. ఎక్కవ వేగంగా వెళ్లినట్లయితే స్పీడ్ లేజర్ గన్‌లో వాహన వేగం నమోదై వాహనం నంబర్ ఆధారంగా యాజమాని చిరునామా వివరాలు తెలుస్తాయి.

ఇంటికే ఈ–చలానా..

నిబంధనలు అతిక్రమించిన వాహనదారుల ఇళ్లకు ఈ–చలనాలు పంపిస్తున్నారు. చిరునామా ఆధారంగా జరిమానా విధించి వారంలో చెల్లించాలని పేర్కొంటున్నారు. అయితే సెల్‌ఫోన్లలో ఈ–చలానా యాప్ డౌన్‌లోడ్ చేసుకుని నెంబర్ టైప్ చేసినా ఫైన్ వివరాలు తెలుస్తాయి. చాలా మందికి ఈ–చలానాపై అవగాహన లేకపోవడం వల్ల వేల సంఖ్యలో కేసులు పేరుకుపోతున్నాయి. ట్యాక్స్ చెల్లింపు, రీ రిజిస్ట్రేషన్, పర్మిట్, తదితర సమయాల్లో ఈ–ఫైన్‌ల వివరాలు బయట పడతాయి. ఫైన్ చెల్లిస్తేనే ఆ లావాదేవీ ముందుకు వెళ్తుంది. ఒక సారి జరిమానా పడిన వాహనానికి మళ్లీ అదే తప్పు చేసినట్లయితే రూ.10 వేలు జరిమానా విధిస్తున్నారు.

లక్షల్లో కేసులు..

నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై రవాణాశాఖ అధికారులు లక్షల్లో అపరాధ రుసుము వసూలు చేస్తున్నారు. జరిమానాల వివరాలు పరిశీలిస్తే..

సంవత్సరం	కేసులు	అపరాధ రుసుము
2021–22 (ఉమ్మడి జిల్లా)	85,381	13,83,34,900
2022–23	92,291	18,80,80,000
ఓవర్ స్పీడ్, (స్పీడ్ గన్)తో		
2021–22	10,969	2,37,18,500
2022–23	8756	2,24,10,500

నిబంధనలు పాటించాల్సిందే..



ప్రతి వాహనదారుడు తప్పకుండా ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే. ప్రతి రోజూ తనిఖీలు చేపడుతున్నాం. నిబంధనలు అతిక్రమించిన వాహనదారుల ఇళ్లకు చలానాలు పంపిస్తున్నాము. ఒక సారి ఫైన్ పడిన వాహనం రెండోసారి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా విధిస్తాం. ఈ చలానాల స్పీడ్ పెంచుతున్నాం. అందరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలి.

– కె.శ్రీధర్, జిల్లా రవాణాశాఖాధికారి, కాకినాడ

ఫలసాయం వేలం పాట వాయిదా

కొత్తపల్లి: వాకతిప్పలో ఉన్న నాగులాపల్లి రక్షిత మంచినీటి పథకంలో ఉన్న ఫలసాయం వేలం పాటను వాయిదా వేసినట్టు జిల్లా పరిషత్ రెవెన్యూ ఆఫీసర్ కే శ్రీనివాస్ తెలిపారు. నాగులాపల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రక్షిత మంచినీటి పథకంలో ఉన్న 22 కొబ్బరి చెట్లు, 8 మామిడి చెట్లకు వేలం పాట నిర్వహించారు. అయితే సంవత్సరానికి నిర్ణయించిన కనిష్ట ధర రూ.44 వేలు కావడంతో పాట పాడుకునేందుకు ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. దీంతో పాటను వాయిదా వేస్తున్నట్టు శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రమణక్కపేట ఎస్సీ పేటకు చెందిన తాతపూడి విజయ్(24) తొండంగి మండలంలో అరబిందో ఫార్మాలో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా పిఠాపురం వైపు నుంచి వస్తున్న బొలెరో వ్యాన్ రమణక్కపేట సమీపంలో ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయ్‌ను పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెద్దాపురం: స్థానిక దర్గా సెంటర్ హెచ్‌పీ బంక్ ఎదురుగా ఉన్న డ్రైనేజీ సమీపంలో అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని గుర్తించినట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆ వ్యక్తికి సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. అతనిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిపిన వారు 94409 04846 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సైన్స్ క్విజ్‌లో కాండ్రకోట విద్యార్థి ప్రతిభ


బహుమతులతో వెంకటరమణ

పెద్దాపురం: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కాకినాడలో నిర్వహించిన సైన్స్ క్విజ్ పోటీల్లో మండలంలోని కాండ్రకోట హైస్కూల్ విద్యార్థి తన ప్రతిభ కనపర్చాడు. ఈ మేరకు మంగళవారం కాకినాడలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో పాఠశాలకు చెందిన నీలం వెంకటరమణ (8వ తరగతి) ప్రతిభ కనపర్చి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చాడు. వెంకట రమణను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధి కల్పన దిశగా చర్యలు

- కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సారించాలి
- జేఎన్‌టీయూకే ఐఐఐ పీటీ డైరెక్టర్ బత్తుల


క్యాంపస్ డ్రైవ్‌లో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఐఐఐ పీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే కళాశాలతో పాటు అనుబంధ కళాశాల విద్యార్థులకు పట్టాతో పాటు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఐఐఐ పీటీ (ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్లేస్‌మెంట్ ట్రైనింగ్) డైరెక్టర్ బత్తుల తిరుమల కృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో మంగళవారం వర్సిటీ ప్లేస్‌మెంట్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం తగిన విధంగా ఉపయోగించుకుని పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రతి నెలా రెండు నుంచి మూడు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించేలా కంపెనీ ప్రతినిధులతో సంప్రదించి ఏర్పాటు చేస్తున్నామన్నారు. బెంగళూరుకు చెందిన ఎడ్యుటెక్ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించగా ఎంబీఏ విభాగానికి చెందిన 40 మంది విద్యార్థులకు 13 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.5 లక్షల వేతనం ఉంటుందని తెలియజేశారు. సాయి పవర్ ఎక్విప్‌మెంట్ హెచ్ఆర్ మేనేజర్ సాయిపవార్, గోపిలు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ విభాగ అధ్యాపకులు మీసాల మధు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.